క్లుప్తంగా

కాకినాడ డెంటల్ అసోసియేషన్‌కు గుర్తింపు



అవార్డులు చూపుతున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయిలో పలు అవార్డులు సాధించినట్లు అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ తెలిపారు. స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ శాఖ వరుసగా నాలుగో సారి ఉత్తమ పురస్కారాలు సాధించటం ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉచిత దంత వైద్య శిబిరాలు నిర్వహించినందుకు గానూ పురస్కారం లభించిందన్నారు. అధ్యక్షుడిగా బాధ్యత చేపట్టిన నాటి నుంచి నాగేంద్ర ఆధ్వర్యంలో కాకినాడ అసోసియేషన్ సభ్యులు చేసిన అనేక ప్రజోపకార సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఆదివారం ఒంగోలులో అవార్డులు అందుకున్నారన్నారు. రాష్ట్ర ఉత్తమ అధ్యక్షుడితో పాటు పాఠశాల విద్యార్థులకు దంత వైద్య శిబిరాల నిర్వాహణ అవార్డు స్వరూప్‌కి లభించిందని చెప్పారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ అసోసియేషన్ తరపున మంచి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు వీవీ రావు, రఘురామ్, సిరాజ్, చైతన్య పాల్గొన్నారు.

కూటమి నేతల తీరు సిగ్గుచేటు

కాకినాడ సిటీ: సమస్య ఏదైనా రోడ్డును అడ్డాగా చేసుకొని ట్రాఫిక్ స్తంభింపజేయడం మంచి విధానం కాదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు పేర్కొన్నారు. టీడీపీ, జనసేన కూటమి నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద కలెక్టరేట్ రోడ్డుపై పడకేసి ట్రాఫిక్‌ను అడ్డగిస్తూ బైఠాయించటం ప్రజాహిత వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. కారణాలు ఏమైనప్పటికీ అధికార కూటమి నాయకుల నడుమ ఉన్న అంతర్గత విభేదాలను పరిష్కారం చేసుకోకుండా ప్రభుత్వ కార్యాలయాల ముందు పోరాటాలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇదేమీ ప్రజా సమస్య కాదనే విషయాన్ని వారు గుర్తించాలన్నారు. నగరంలో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వాటి కోసం కూటమి నాయకులు రోడ్డెక్కితే మంచిదని పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి అన్నారు.

తటవర్తి మృతి పట్ల సంతాపం

కాకినాడ సిటీ: మహర్షి సాంబమూర్తి సామాజిక విషయాల అధ్యయన సంస్థ, వికలాంగ బాలికల ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపక కార్యదర్శి తటవర్తి శ్రీనివాసరావు మృతి పట్ల సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం రాజశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు. కాకినాడలో వికలాంగ బాలికల ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. సామాజిక, రాజకీయ అంశాలు, ప్రాంతీయ సమస్యలపై నివేదికలు తయారు చేసేవారన్నారు. తటవర్తి కుటంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

మద్యం తాగి బైక్ నడిపితే జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో 22 మందికి రెండు రోజుల జైలు, 28 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1,2 పోలీసు స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. పట్టుబడ్డ వారిని సోమవారం కోర్టులో హాజరు పరచగా 22 మందికి రెండు రోజుల జైలు, 28 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గ్యాస్ సిలిండర్ పేలి వివాహితకు గాయాలు

కాకినాడ క్రైం: మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన కర్రి జయశ్రీ(26) అనే వివాహిత గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రగాయాలపాలైంది. స్థానిక ఆసుపత్రిలో చేరిన ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. గ్యాస్ సిలిండర్ పేలుడు ధాటికి చెలరేగిన మంటల్లో అప్పటికే ఇంట్లో కొని పెట్టుకున్న మందు గుండు సామాగ్రి అంటుకుందని కుటుంబీకులు చెబుతున్నారు. 90 శాతం కాలిన గాయాలతో కాకినాడ జీజీహెచ్‌లోని బర్న్స్ వార్డులో చికిత్స పొందుతున్న జయశ్రీ పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

సినిమాలు

ఆనంద్ సినిమాస్	:	వెనమ్, విశ్వం, వేట్టయాన్ లగ్గం
దేవి మల్టీప్లెక్స్	:	వెనమ్, లగ్గం, గ్యాంగ్‌స్టర్, విశ్వం
లక్ష్మీ	:	పొట్టేల్
సత్యగౌరి	:	వెనమ్
తిరుమల	:	వేట్టయాన్ ది హంటర్
సీఅండ్‌సీ	:	నరుడి బ్రతుకు నటన
సీఅండ్‌సీ 2	:	శ్వాగ్
పద్మప్రియ	:	దేవర
శ్రీప్రియ	:	మార్టిన్
సూర్య 1	:	వెనమ్
సూర్య 2	:	దేవర

ఫుడ్ ట్రెండ్ ఛేంజ్..!



నాగమల్లితోట జంక్షన్ వద్ద కంటైనర్ రెస్టారెంట్‌లో 4ఏఎం బిర్యానీ సెంటర్



కాకినాడ సురేష్ నగర్‌వద్ద ఏర్పాటైన 4ఏఎం బిర్యానీ పాయింట్

మారుతున్న కాలంతో పాటు నేటి తరం ఆహారపు అలవాట్లు, సమయ పాలన అంతే వేగంగా మారిపోతోంది. రాత్రి మిగిలిన అన్నంలో పెరుగు, మజ్జిగ వేసుకొని ఉదయం చద్దన్నం ఆరగించే పాత తరం కనుమరుగైంది. అల్పాహారం పేరుతో టిఫిన్లకు అలవాటు పడిన జనం నేడు ఏకంగా తెల్లవారు జామునే వేడి వేడి బిర్యానీలు ఆరగించేందుకు ఎగబడుతున్నారు. ఆహారపు అలవాట్లతో పాటు సమయాన్ని సైతం మార్చేయటం విస్మయాన్ని కలిగిస్తోంది.

- 4ఏఎం బిర్యానీకి అలవాటు పడుతున్న నగర వాసులు
- కాకినాడలో విస్తరిస్తున్న తెల్లవారు జాము బిర్యానీ అమ్మకాలు
- స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎగబడుతున్న జనం

కాకినాడ రూరల్: ప్రస్తుతం కాకినాడ నగరంలో 4ఏఎం బిర్యానీ ట్రెండ్‌గా మారింది. వేకువ జామునే వేడి వేడి బిర్యానీ అందించేందుకు వ్యాపారులు తమ హోటళ్లను సిద్ధం చేస్తున్నారు. రెండు నెలలుగా కాకినాడలో 4ఏఎం బిర్యానీ హోటళ్లు అందుబాటులోకి వచ్చాయి. కాకినాడ రామారావుపేట, నాగమల్లితోట జంక్షన్ ఎఫ్ 2 కంటైనర్ రెస్టారెంట్, సురేష్‌నగర్ వద్ద ఒక హోటల్ నిర్వాహకులు తెల్లవారు జామున బిర్యానీ అమ్మకాలు సాగిస్తున్నారు. వీటిలో రెండు హోటళ్లు వారంలో రెండు రోజులు మాత్రమే సేవలందిస్తుండగా, సురేష్‌నగర్ వద్ద హోటల్ నిర్వాహకులు వారం రోజులూ అమ్మకాలు సాగిస్తున్నారు. కర్నాటకలో ఫేమస్‌గా చెప్పుకునే 4ఏఎం బిర్యానీని కాకినాడకు పరిచయం చేయడంతో మాంసాహార ప్రియులు లొట్టలేసుకుంటూ ఒక్క సారి రుచి చూడాలని ఎగబడుతున్నారు.

ఇదో వింత అనుభూతి..



కాకినాడలో 4ఏఎం బిర్యానీ పాయింట్లు అందుబాటులోకి రావడం కొత్త వింతగా ఉంది. తెల్లవారు జామున నిద్ర లేచి వచ్చి బిర్యాని తినడం వింత అనుభూతిని ఇస్తోంది. మారుతున్న కాలంతో పాటు అలవాట్లు, సమయం క్రమంగా మారుతుందని చెప్పడానికి 4ఏఎం బిర్యానీ సెంటర్లే నిదర్శనం. రాత్రి విధులు నిర్వహించి తెల్లవారు జామున ఇళ్లకు వెళ్లేవారికి ఇటువంటి బిర్యానీ పాయింట్లు ఉపయోగపడతాయి.

– తలారి పండు, కాకినాడ

పాశ్చాత్య మోజులో యువత

హోస్కోటే మటన్ ధమ్, హోస్కోటే చికెన్ ధమ్ బిర్యానీలు చిట్టి ముత్యాల బియ్యంతో తయారు చేసి విక్రయాలు చేపడుతున్నారు. మటన్ ధమ్ బిర్యానీ రూ.280కు విక్రయిస్తుండగా చికెన్ ధమ్ బిర్యానీ రూ.150కు అమ్ముతున్నారు. తెల్లవారు జామున స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి ఆరగించేందుకు జనం ఎగబడుతున్నారు. సాధారణంగా హోటళ్లలో బిర్యానీ మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. కానీ తెల్లవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకు 4ఏఎం బిర్యానీ పేరున విక్రయాలు జరపడం, భోజన ప్రియులు హోటళ్లకు పరుగులు తీయటం మాత్రం పాశ్చాత్య సంస్కృతి విస్తరిస్తున్న తీరుకు అద్దం పడుతోంది.

బీసీ ఉద్యోగుల కార్తిక వన సమారాధన

బోట్‌క్లబ్: కాకినాడ జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 24న కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు రామానుజం శ్రీనివాస్ తెలిపారు. స్థానిక నరసన్ననగర్‌లోని గెద్దాడ ఎన్‌క్లేవ్‌లో సోమవారం బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. వన సమారాధన నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశంలో సంఘ ప్రధాన కార్యదర్శి గంటి రాధాకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



బోట్‌క్లబ్: స్థానిక రామారావుపేట సౌమ్య ఎన్‌క్లేవ్‌లో మరకత మణికంఠకు ఉత్తరా నక్షత్రం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం చేపట్టారు. పీఠం వ్యవస్థాపకులు నందమూరి వినోద్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవ, దీపోత్సవం నిర్వహించారు. పీఠం కార్యవర్గ సభ్యులు పుప్పాల ఉదయభాస్కర్, జి.సతీష్, శ్రీను పాల్గొన్నారు.

గోపాష్టమి వేడుకల వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రవిశంకర్ పట్నాయక్

కాకినాడ రూరల్: మండపేటలో నవంబరు 9న నిర్వహించనున్న హనుమంతుని గోపాష్టమి వేడుకకు సంబంధించిన గోడ పత్రికను సర్పవరం జంక్షన్‌లో విశ్వహిందూ పరిషత్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ సోమవారం ఆవిష్కరించారు. మండపేట గోశాలలో జరగనున్న గోపాష్టమి వేడుకల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. గోమాత లక్ష్మీ స్వరూపమని, హిందువుల ఆరాధ్య దేవత అని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ, సర్వ మానవ సుఖ జీవనం, లోక కల్యాణార్థం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కాకినాడ నగరశాఖ అధ్యక్షుడు రాజా, బానోజీ రావు, న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు, అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మలేషియా పర్యటనతో సామర్థ్యాల మెరుగు



వీసీ మురళీకృష్ణతో మలేషియా పర్యటన బృంద సభ్యులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): మలేషియాలోని మెలాకా యూనివర్సిటీలో నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాపు జేఎన్‌టీయూకే అకడమిక్ ఎక్స్‌లెన్స్‌ను అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది మలేషియా పర్యటన అనంతరం సోమవారం వర్సిటీకు విచ్చేసి వీసీ మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ పర్యటన ద్వారా అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందికి తమ విభాగాల్లో సామర్థ్యాలు మెరుగుపర్చుకోడానికి వీలు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీంద్ర, సీఈ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ స్వరూపారాణి, దీక్షితులు, నాన్ టీచింగ్ స్టాఫ్ జోగారావు, హెచ్‌ఆర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా తూర్పు జట్టు



పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తూర్పు బాలికల జట్టు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల ఫుట్‌బాల్ పోటీలలో బాలికల విభాగంలో తూర్పు గోదావరి జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అండర్–14 విభాగంలో నిర్వహించిన ఈ పోటీలలో ఫైనల్స్‌లో తూర్పు జట్టు అనంతపురంపై 3–0 తేడాతో ఓటమి పాలై రన్నర్స్ స్థానం దక్కించుకుంది. జాతీయ స్థాయి పోటీలకు మేఘన, భవ్యశ్రీ, కృష్ణ యశస్విలు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో క్వాటర్స్ దశలో జిల్లా జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. బాలుర విభాగంలో సూర్య ఎంపికయ్యాడు. స్టాండ్‌బైగా యు.భార్గవి జట్టులో స్థానం పొందింది. ఈ జట్టుకు కోచ్, మేనేజర్లుగా జిజెఆర్‌ఎస్ కౌర్, జిసిటిఎల్ కౌర్‌లు, జ్యోతి వ్యవహరించారు.

అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగించండి

కమిషనర్ భావన ఆదేశం



కమిషనర్ ఆదేశాలతో ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

కాకినాడ: నగరంలో అనుమతి లేని ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆమె నగరంలోని ఫ్లెక్సీ ఫ్రీ జోన్ ప్రాంతాల్లో పర్యటించారు. అనేక చోట్ల అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తించారు. నగర సుందరీకరణలో భాగంగా ఎంపిక చేసిన ముఖ్య ప్రాంతాల్లో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయవద్దని గతంలోనే స్పష్టం చేసినప్పటికీ మళ్లీ ఏర్పాటు చేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే అనుమతిలేని ఫ్లెక్సీలు అన్నింటినీ తొలగించాలని టౌన్ ప్లానింగ్ విభాగాన్ని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టౌన్ ప్లానింగ్ ఏసీపీలు తొలగించారు.

అడ్డగోలుగా బాణసంచా దుకాణాల కేటాయింపు

కాకినాడ క్రైం: కాకినాడలోని మెక్లారిన్ గ్రౌండ్‌లో ఏర్పాటు కాబోతున్న బాణసంచా దుకాణాల వ్యవహారం కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు తీరుతో రచ్చకెక్కింది. దుకాణాలకు నంబర్ల కేటాయింపులో అడ్డగోలు వ్యవహారం వెలుగు చూసింది. స్థానిక సినిమారోడ్‌లో ఉన్న బాలాజీ గ్రాండ్ హోటల్‌లో సోమవారం జరిగిన వేలం ప్రక్రియ ఏకపక్షంగా సాగింది. ఏకంగా 18 దుకాణాలను ఎమ్మెల్యే పేరుతో వేలం నుంచి తప్పించారు. ఎంహెచ్‌వో ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ ప్రక్రియను ఆయన స్పందన కార్యక్రమానికి హాజరైన సమయంలో పూర్తి చేశారు. దీంతో షాపులకు నంబర్ల కేటాయింపు ఏకపక్షమైపోయింది. ఈ నంబర్ల సిరీస్ ఆధారంగానే తొలి నంబర్లు కేటాయించబడ్డ షాపులు రోడ్డుకు దగ్గర గాను, చివరి నంబర్లు కేటాయించబడ్డ షాపులు గ్రౌండ్ చివరి లోను ఏర్పాటు కానున్నాయి.

రోడ్డెక్కిన వలంటీర్లు

- బకాయి పెట్టిన వేతనాలు చెల్లించాలని డిమాండ్
- చంద్రబాబు ఎన్నికల హామీని అమలు చేయాలని ఆందోళన



కలెక్టరేట్ వద్ద బైఠాయించిన వలంటీర్లు

కాకినాడ సిటీ: వలంటీర్ల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వలంటీర్ల యూనియన్ జిల్లా కన్వీనర్ ఇనకోటి వరుణ్‌కుమార్, కునిరెడ్డి రవిలు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు పూర్తి కావస్తున్నా వలంటీర్లకు ఒక్క రూపాయి వేతనం కూడా అందలేదన్నారు. తక్షణం బకాయి పెట్టిన ఐదు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వలంటీర్లపై వైఎస్సార్ సీపీ ముద్రవేసి తొలగించే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఉద్యోగ భద్రతకై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రజలకు చేసిన సేవలు గుర్తించి వ్యవస్థను కొనసాగించాలని కోరారు. నవంబర్ 6న కేబినెట్ మంత్రుల సమావేశంలో వలంటీర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. నవంబర్ 1, 2 తేదీల్లో తహసీల్దార్ కార్యాలయాల ముందు నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ఉద్యమ కార్యాచరణను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రొంగల ఈశ్వరరావు, తొట్టిపూడి రాజా, మేడిశెట్టి వెంకట రమణ, నందేశ్వరరావు, వలంటీర్ల సంఘం నాయకులు అడ్డాల ప్రకాష్, దాట్ల రమేష్, దుర్గాప్రసాద్, సతీష్, ప్రవీణ్, వరలక్ష్మి, పిల్లా భవాని, శ్రీదేవి, జాకబ్, నిమ్మన నాగలక్ష్మి, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ధరలకు రెక్కలు

బోట్‌క్లబ్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జీలు పెంచారని పెద్ద ఎత్తున ఉద్యమ బాట పట్టించిన కూటమి నేతలు నాలుగు నెలల వ్యవధిలోనే యూనిట్‌కు రూ.1.21 పైసల వంతున చార్జీలు పెంచడం దారుణమని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మండిపడ్డారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చార్జీలు తగ్గాలంటే తాము అధికారంలోకి రావాలని ప్రగల్బాలు పలికి తీరా వచ్చిన తర్వాత చార్జీల మోత మోగించడం తగదన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, కరెంట్ చార్జీలు పెరగటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం నిత్యావసర వస్తువులు కొనలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ధరలు భరించ లేని ప్రజలు సహాయ నిరాకరణ చేయడం తప్పదన్నారు. కూటమి ప్రభుత్వం పెంచిన చార్జీలతో సామాన్య గృహాల నుంచి మధ్య తరగతి గృహాల వరకు రూ.100 నుంచి రూ.500 వరకు అదనపు భారం పడుతుందన్నారు.

ఆటిజం ఉత్పత్తులను ప్రోత్సహించాలి



వస్తువులు పరిశీలిస్తున్న వ్యవస్థాపకురాలు సునీత

బోట్‌క్లబ్: ఆటిజం పిల్లలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని 'ఆసరా సెంటర్ ఫర్ ఆటిజం' వ్యవస్థాపకురాలు సునీత విజ్ఞప్తి చేశారు. ఆటిజం పిల్లలు రూపొందించిన దీపావళి ఉత్పత్తుల ప్రదర్శనను ప్రముఖ ఇంజినీర్ ఎస్. ఎస్.బలరాం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఈ పిల్లలకి ఒకేషనల్ శిక్షణ ఎంతో అవసరమని దీనిపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ఇంట్లో ఉంచకుండా ప్రతిరోజు కొంత సమయం బయట ప్రపంచాన్ని చూపించే విధంగా తీసుకెళ్లాలన్నారు. మానసికంగా వారిలో ఆనందం కలిగించే విధంగా తల్లితండ్రులు ప్రత్యేక విషయాలను పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలు తయారు చేసిన దీపావళి వస్తువులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని వాటిని కొనుగోలు చేయడం ద్వారా శ్రమ, కృషిని ప్రోత్సహించిన వారవుతారన్నారు.

రక్తదానం చేస్తే ప్రాణదానమే..



యూనిట్ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న సిబ్బంది

కాకినాడ రూరల్: ఎవరైనా రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్టేనని ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా స్థానిక రమణయ్యపేటలోని ఏపీఎస్పీ బెటాలియన్ యూనిట్ ఆస్పత్రిలో సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కాకినాడ ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా దేవానందరావు మాట్లాడుతూ, తాము దానం చేసిన రక్తం పేదలకు మాత్రమే చెందాలని జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌ను అందించామన్నారు. మొత్తం 72 మంది రక్తదానం చేయగా, వీరిలో 67 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ జి.లక్ష్మి, యూనిట్ మెడికల్ ఆఫీసర్ సునీల్‌కుమార్, లేడీ మెడికల్ ఆఫీసర్ లక్ష్మీదేవి, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకుమార్, మన్మథరావు, ఆర్‌ఐలు రవిశంకర్, వితలేశ్వరరావు, శ్రీనివాసరావు, రాము, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వర పరిష్కారం

కార్పొరేషన్ కమిషనర్ భావన



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్‌లో 18 మంది ఫోన్ ద్వారా పలు సమస్యలను కమిషనర్‌కు వివరించారు. అలాగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు సుమారు 50 మంది అర్జీలు దాఖలు చేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను కోరారు. డ్రైనేజీలు, ప్రైవేటు స్థలాల్లో ఆక్రమణలు, పారిశుధ్య సమస్య సహా ఆయా విభాగాలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, మేనేజర్ శిరీష్, ఏసీపీ నాగశాస్త్రులు, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు వినియోగించుకోవాలి

కాకినాడ సిటీ: శాసనమండలిలో పట్టభద్రుల ప్రతినిధిగా మంచి నాయకుడిని ఎన్నుకునేందుకు పట్టభద్రులైన ప్రతి ఉద్యోగి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామమోహనరావు కోరారు. సోమవారం ఎన్‌జీవో హోమ్‌లో నిర్వహించిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌జీవో హోమ్‌లోనూ, ప్రతి తాలూకా కేంద్రాల్లో ఓటు నమోదు చేసుకొనేందుకు సహాయక కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నమోదు కావాలన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించి ఫిబ్రవరిలో ఉభయ గోదావరి జిల్లాలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికలలో మంచి అభ్యర్థిని ఎన్నుకునేందుకు ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌జీవో అసోసియేషన్ నాయకులు పేపకాయల వెంకటకృష్ణ, పసుపులేటి శ్రీనివాసు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు, సరేళ్ల చంద్రరావు, పద్మమీనాక్షి పాల్గొన్నారు.